ప్రజాశక్తి
సోమవారం 12 డిసెంబర్ 2022 5
శ్రీ సత్యసాయి



ఎసిబి వలలో..'వివాదాల రాము'



◆ రూ.25 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సిఐ
◆ ఆది నుంచి ఆయన తీరు వివాదాస్పదమే
◆ గతంలోనే అనేక ఫిర్యాదులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లా పోలీసు శాఖలో వివాదాల రాముగా పేరొందిన బుక్కరాయసముద్రం సిఐ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ(ఎసిబి) వలలో చిక్కాడు. బెయిల్ మంజూరు కోసం రూ.25 వేలు లంచం తీసుకుంటుండగా శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు సిఐ రాముతోపాటు కానిస్టేబుల్ కరీమ్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అరెస్టు చేసి కర్నూలులోని ఎసిబి కోర్టులో హాజరుపరిచారు. అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ శివనారాయణ తెలిపిన సమాచారం మేరకు నెల్లూరుకు చెందిన మల్లికార్జున అనే వ్యక్తి బుక్కరాయసముద్రం మండల పరిధిలో కొండారెడ్డి అనే వ్యక్తికి సంబంధించిన సర్వే నెంబరు 611-1 భూమిని లీజుకు తీసుకని డీఎడ్ కళాశాల నడుపుతుండేవాడు. భూ యజమాని కొండారెడ్డి డబ్బులు తీసుకుని తనకు మోసం చేశాడని 2021లో మల్లికార్జున ఫిర్యాదు చేయగా ఛీటింగ్ కేసు పెట్టారు. ఇందులో కొండారెడ్డి జైలుకెళ్లి వచ్చిన తరువాత మల్లికార్జున ఆయన భార్య, తమ్ముడులు మోసం చేసారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు మల్లికార్జునను బికెస్ పోలీసులు అరెస్టు చేశారు. అతని భార్య, తమ్ముడు అజ్ఞాతంలోకి వెళ్లారు. వీరు హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. దీన్ని పరిగణలోకి తీసుకుని బెయిల్ ఇవ్వాలంటే రూ.75 వేలు లంచమివ్వాలని సిఐ రాము డిమాండ్ చేశారు. మొదట రూ.50 వేలు డబ్బులిచ్చారు. తక్కిన రూ.25 వేలు లంచమిస్తేనే బెయిల్ ఇస్తామని లేకపోతే, బెయిల్ పేపర్లు చింపేసి, విచారణకు సహకరించలేదని కోర్టులో పిటీషన్ వేస్తానని రాము బెదిరించాడు. దీంతో భార్య, తమ్ముడులు యాప్‌లో అవినీతి నిరోధక శాఖకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న ఎసిబి అధికారులు శుక్రవారం రాత్రి పోలీసు స్టేషన్ వద్ద లంచం తీసుకుంటూ ఉండగా ఎసిబి అధికారులు కాపు కాచి సిఐ రాముతో పాటు కానిస్టేబుల్ కరీంను పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కర్నూలు ఎసిబి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎసిబి డీఎస్పీ శివనారాయణ తెలిపారు.

వివాదాల రాము

బుక్కరాయసముద్రం సిఐ రాము గతంలోనే ఒకసారి వివాదాస్పదమయ్యారు. ఒక సమావేశంలో గుంతకల్లు ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డిని సింహంతో, ఇతరులను గొర్రెలతో పోల్చిన వ్యాఖ్యలు అప్పట్లో పెద్ద దుమారం రేపాయి. ఆ తరువాత ఒక టీ కొట్టు నిర్వాహకుడిని కొట్టడం కూడా వివాదాస్పదమైంది. ఈ క్రమంలో ఆయన్ను అక్కడి నుంచి తప్పించారు. తాజాగా బుక్కరాయసముద్రం సిఐగా వచ్చారు. ఇక్కడి కూడా అనేక వివాదాలు, ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. పైసలివ్వనిదే ఆ పోలీసు స్టేషన్‌లో పని జరగదన్న ఆరోపణలు ఇటీవల అధికం అయ్యాయి. సాధారణమైన వాటికి కూడా పైసలిస్తేనే పని జరుగతుందని, లేకపోతే ఇబ్బందులు తప్పవన్న ఆరోపణలున్నాయి. తాజాగా ఇప్పుడు పట్టుబడిన కేసులోనూ న్యాయస్థానం ఇచ్చిన బెయిల్‌ను అనుమతించేందుకు కూడా రూ.75 వేలు డిమాండ్ చేశారంటే ఆ పోలీసు స్టేషన్‌లో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదే తరహా మరో ఘటనలోనూ డబ్బులు ఇవ్వనందుకు సిఐ రాము పని జరగనివ్వకుండా అడ్డు వేసారన్న ఆరోపణ లున్నాయి.



ఎసిబికి చిక్కిన సిఐ రాము

లోక్‌అదాలత్‌లో పరిష్కారమైనా... వదలని వాహనం

2020లో బుక్కరాయ సముద్రం పరిధిలో ఓ వాహనంకు సంబంధించి కేసు నమోదయ్యింది. బొలేరో వాహనం, స్కూటర్ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఈకేసు ఇటీవల జరిగిన మెగా లోక్ అదాలత్‌లో పరిష్కారమైంది. పరిష్కారమైన పత్రాలను తీసుకుని వచ్చి స్టేషన్‌లో ఉన్న వాహనాన్ని తీసుకెళ్లేందుకు వాహన యజమాని వెళ్లాడు. అయితే ఇప్పటికీ ఆ వాహనంను బికెఎస్ పోలీసులు ఆ యజమానికి ఇవ్వలేదు. కొంత మొత్తాన్ని సదరు యజమాని ముట్టజెప్పినా ఆ అధికారి సంతృప్తి కలగలేదు. దీంతో వాహనం విడుదల చేయడం వాయిదాలు వేస్తూ వస్తుండటంతో వాహన యజమాని స్టేషన్ చుట్టు ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా ఆ పోలీసు స్టేషన్‌లో చిన్నచిన్న కేసుల్లోనూ డబ్బులు ముట్టజెబితేనే పనులు సాగుతాయి... లేకపోతే బాధితులు స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిందే.

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత

◆ ప్రభుత్వ ఆదేశాలను పాటించాలి
◆ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి
◆ అనంతపురం జిల్లా కార్మిక శాఖ డిసిఎల్ రఘురాములు



ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కార్మికుల సంక్షేమం అభివృద్ధి కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, ఫలాలు అందించడమే తమ లక్ష్యమని అనంతపురం జిల్లా కార్మిక శాఖ ఇన్‌ఛార్జి కమిషనర్ జి.రఘురాములు పేర్కొన్నారు. జిల్లాలో కార్మికుల కోసం చేపడుతున్న చర్యలు, అందిస్తున్న సేవలపై ప్రజాశక్తి ముఖాముఖితో ఆయన ముచ్చటించారు.

ప్ర: జిల్లాలో ఎన్ని పరిశ్రమలు ఉన్నాయి.? కార్మికుల పరిస్థితి ఎలా ఉంది.?

డిసిఎల్ : జిల్లాలో 500కు పైబడి పరిశ్రమలు ఉన్నాయి. కొన్ని పరిశ్రమలు మూతబడ్డాయి. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ఏదైనా సమస్యలు తలెత్తితే కార్మిక శాఖకు ఫిర్యాదు చేస్తారు. ఆ ఫిర్యాదు మేరకు తమ శాఖ అధికారులు పరిశీలించి సమస్య ఉందని తెలిస్తే సంబంధిత పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి పరిష్కరిస్తాం. యజమాన్యం కార్మికులకు అన్యాయం చేస్తూ ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే న్యాయశాఖను ఆశ్రయించి కార్మికులకు న్యాయం జరిగేంత వరకు పని చేస్తాం.

ప్ర: పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారా.?

డిసిఎల్ : జిల్లాలో పలు పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించిన మాట వాస్తవమే. ప్రమాదం సంభవిస్తే సంబంధిత యాజమాన్య నిర్వహణ లోపం, అజాగ్రత్తల వల్లే అని నిరూపణ అయితే బాధిత కార్మికులకు పరిహారం ఇప్పిస్తున్నాం. ప్రభుత్వం నుంచి వారి కుటుంబాన్ని ఆదుకునే చర్యలూ తీసుకుంటున్నాం. పరిశ్రమల యజమానులు పరిశ్రమ నిర్వహణకు అన్ని అనుమతులు తీసుకున్న తరువాతనే ఏర్పాటు చేస్తున్నారు. భద్రత చర్యలు ఉంటేనే ప్రభుత్వం అనుమతి ఉంటుంది. మధ్యలో ఏదైనా ప్రమాదం ఏర్పడితే యాజమాన్యం బాధ్యత తీసుకోవాలి. బాధితుల పక్షాన తమ శాఖ పని చేస్తుంది.



ప్ర: యాజమాన్యాలు కార్మికుల శ్రమ దోపిడీ చేస్తున్నట్లు ఆరోపనలు ఉన్నాయి.. వాస్తవేమేనా.?

డిసిఎల్ : పరిశ్రమలో పనిని బట్టి కార్మికులను నియమిస్తారు. చేరేప్పుడే వేతనం ఎంత ఇస్తారో స్పష్టమైన హామీతోనే చేరుతున్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికుల వారు ఇచ్చే వేతనాలు పెంపుదల చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ రంగ సంస్థల్లో అది తూచా తప్పకుండా అమలు అవుతుంది. ప్రయివేటు పరిశ్రమల్లో ఈ పరిస్థితి కొంత ఉండదు. కార్మికుల పనిని బట్టి యజమానులే వేతనాలు నిర్ణయిస్తారు. 10 మంది చేయాల్సిన పనిని 5 మందితో చేయించి ఇబ్బందులు పెడితే తప్పకుండా యాజమాన్యం తప్పే. అలాంటి ఫిర్యాదులు వస్తే పరిశీలన చేసి కార్మిక శాఖ ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

ప్ర: కార్మికులను తొలగిస్తే ఎలాంటి చర్యలు తీసుకున్నారు.?

డిసిఎల్ : యజమాని పరిశ్రమ మూత వేస్తున్నప్పుడు కార్మికులను తొలగిస్తే ఎవరూ ఏమీ చేయలేరు. పరిశ్రమ నిర్వహిస్తూనే ఎలాంటి తప్పు లేకుండా తొలగించారన్న ఫిర్యాదు చేస్తే పరిశీలించి కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తున్నాం. కార్మికుల యాజమాన్యం నిబంధనలు అతిక్రమించి ఏదైన పొరపాట్లు చేశారన్న కారణంతో తొలగిస్తే కూడా ఏమి చేయలేం. అలాంటి ఫిర్యాదులను పరిశీలన చేసి కార్మికుల తప్పిదం లేదని తేలితే వారికి అండగా నిలుస్తున్నాం.

ప్ర: కార్మిక శాఖ యాజమానులకు అనుకూలంగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.. ఇది వాస్తవేమేనా.?

డిసిఎల్ : జిల్లాలో కొత్త పరిశ్రమలు రావాలి. అప్పుడే కొత్తగా కార్మికులకు పని లభిస్తుంది. పరిశ్రమలను ప్రభుత్వమే స్వాగతిస్తోంది. సరళీకరణ విధానం కార్మిక చట్టాల్లో కూడా జరిగింది. ప్రభుత్వ పాలకులు, చేసిన చట్టాలను అధికారులుగా తాము అమలు చేయాల్సిందే. వ్యాపారం అభివృద్ధి జరిగినప్పుడే కొత్త పరిశ్రమలు వస్తాయి. యజమానులకు తమ శాఖ ద్వారా ఇవ్వాల్సిన అన్ని అనుమతులు ఇస్తాం. అంత మాత్రాన యజమానులకు అనుకూలంగా పని చేసినట్టు కాదు కదా. విరివిగా ఉపాధి కల్పించడం ప్రభుత్వ లక్ష్యం. చిన్న చిన్న పొరపాట్లు యాజమాన్యం చేస్తే సరి చేసి సక్రమంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

ప్ర: కార్మికుల సంక్షేమం అమలు జరుగుతోందా.?

డిసిఎల్ : భవన నిర్మాణ రంగం కార్మికులకు శాఖ తరుపున వివాహ ప్రోత్సహకాలు, ప్రసూతి సహాయం, ప్రమాదం జరిగితే ఎక్స్‌గ్రేషియా తదితరాలు ఇస్తాం. సాధారణ మృతికి రూ.60 వేలు, దహన సంస్కారాలకు రూ.20 వేలు, ప్రమాదవశాత్తు జరిగితే రూ.2 లక్షలు, అంగవైకల్యంకు రూ.2 లక్షలు ఇలా ఇస్తున్నాం. కార్మికశాఖ నుంచి ఇచ్చే ప్రోత్సాహకాల కంటే రాష్ట్ర ప్రభుత్వం ఆయా కులాల వారీగా ఇస్తున్న సదుపాయాలు ఎక్కువగా ఉంది. లబ్ధిదారుడు ఎక్కడో ఒక శాఖ ద్వారా మాత్రమే తీసుకోవాలి. కార్మిక శాఖ కంటే విద్యా, వైద్యం, ప్రమాద బీమ రంగాల నుంచి అధిక ప్రోత్సాహం ఇస్తున్నప్పుడు అక్కడే తీసుకుంటుంన్నారు. మా శాఖ తరుపున ఇవ్వాల్సిన ఇతర శాఖలకు బదలాయింపులు చేశారు. అనుమతులు కూడా ఆన్‌లైన్ మీసేవా ద్వారా పొందుతున్నారు. గతంలో అనేక పర్యవేక్షణ తమ శాఖ పరిధిలో ఉండేది అనేక మార్పులు జరిగిన తరువాత ఇతర శాఖలకు కొన్ని బాధ్యతలు అప్పగించారు. చిన్న షాపులు, సంస్థలు సెల్ఫ్ డిక్లరేషన్ ద్వారా ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుని నిర్వహించుకుంటున్నారు. వీరికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. వాటిని అందరూ పాటించాల్సిందే.

నాటువైద్యాన్ని నమ్మొద్దు : డిఎంహెచ్ఒ

ఓబులదేవరచెరువు : ప్రజలు అర్హత ఉన్న వైద్యుల వద్దకే వెళ్లి వైద్యం చేయించుకోవాలని నాటు వైద్యాన్ని నమ్మొద్దని ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ కృష్ణయ్య తెలిపారు. మోకాళ్ళకు నాటువైద్యం ఇంజక్షన్‌తో తుమ్మలకుంటపల్లికి చెందిన ముగ్గురు మృతిచెందారు. ఈ నేపథ్యంలో ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒతో పాటు వైద్యులు ఆ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఆర్ఎంపిలను, నాటువైద్యులను సంప్రదించకుండా అర్హత ఉన్న వైద్యాధికారి వద్దకువెళ్లి చికిత్స తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో సూది మందు తీసుకున్న పదిమందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్య బందం తెలిపింది. ఈ కార్యక్రమంలో డిపిఎంఒ కుళ్లాయప్ప నాయక్, అడిషనల్ డిఎంహెచ్ఒ ఐనుద్దీన్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాష్. వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర్లకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

కదిరి టౌన్: వడ్డెర్లకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని వడ్డెర సంఘం నాయకులు సంపంగి గోవర్ధన్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డికి విన్నవించారు. ఎన్పీకుంట మండలంలో జరిగిన ఓ ప్రయివేటు కార్యక్రమానికి హాజరై వస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి కదిరిలోని వైసిపి నాయకులు డాక్టర్ బత్తల హరిప్రసాద్ నివాసానికి వచ్చారు. ఈసందర్భంగా జాతీయ వడ్డెర హక్కుల సాధన సమితి అధ్యక్షులు, వైసిపి నాయకులు సంపంగి గోవర్ధన్ సజ్జలను కలసి విన్నవించారు. ప్రజా సేవకుడు, వడ్డెర సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ బత్తల హరిప్రసాద్‌కు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 40 లక్షల మంది వడ్డెర్లు ఉన్నాయని చెప్పారు. వడ్డెర్లు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెంటే ఉన్నామని అన్నారు. గత ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ అభ్యర్థుల గెలుపునకు ముఖ్యంగా కదిరి నియోజకవర్గ అభ్యర్థి గెలుపునకు కృషి చేసామని వివరించారు. జనాభా దామాషా ప్రకారం వడ్డెర్లకు ఎమ్మెల్యే, ఎంపీలుగా అవకాశం కల్పించాలని కోరారు. కదిరి నియోజకవర్గంలో సుమారు 40వేల జనాభా కలిగిన వడ్డెర్లు పార్టీ ఆవిర్భావం నుంచి వైసిపి అభివృద్ధికి కృషిచేస్తున్నామన్నారు. ఈనేపథ్యంలో కదిరి నియోజకవర్గ బీసీ నాయకుడు, వడ్డెర సామాజిక వర్గ నాయకులు, వైసిపి రాష్ట్ర సహాయకార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ కి వచ్చే ఎన్నికల్లో అవకాశం కల్పించాలని కోరారు.



సజ్జల రామకృష్ణారెడ్డితో వడ్డెరసంఘం నాయకులు

చిన్నతనం నుంచే శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న జెవివి నాయకులు, తదితరులు

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

చిన్నతనం నుంచే శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని వక్తలు పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే సత్యసాయి జిల్లా చెకుముకి సైన్స్ సంబరాలు స్థానిక వశిష్ట ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో ఆదివారం జరిగాయి. జెవివి జిల్లా ఉపాధ్యక్షులు నర్సారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సైంటిస్టు వేమన, రిటైర్డ్ ప్రిన్సిపల్ వాసుదేవరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెవివి జెండాను ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే శాస్త్ర విజ్ఞానాన్ని శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని అప్పుడే శాస్త్రవేత్తలుగా ఎదగడానికి సమాజాన్ని అభివద్ధి పథంలో నడపడానికి అవకాశం ఉంటుందని అన్నారు. సైంటిస్ట్ వేమన మాట్లాడుతూ వాతావరణంలో విపరీతమైన మార్పులకు మానవుని అజ్ఞానమే కారణమన్నారు. వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక మూడు దశాబ్దాలుగా ప్రజలలో విద్యార్థుల్లో మూఢ నమ్మకాలను రూపుమాపడానికి కృషి చేస్తోందన్నారు. అందుకు మనమందరం తగినంత సహకారం అందించాలని సైన్స్ పై అభిరుచి పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా కళాకారులు శ్రీరాములు, రామాంజనేయులు ఆలపించిన పాటలు, మ్యాజిక్ షో ఆకట్టుకున్నాయి. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు ఆధ్వర్యంలో చెకుముకి జిల్లా స్థాయి పరీక్షను నిర్వహించారు. అందులో కేశవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రయివేటు పాఠశాలల విభాగంలో కదిరి పట్టణానికి చెందిన వాల్మీకి ఇంగ్లీష్ మీడియం స్కూల్ మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో వీరు రాష్ట్రస్థాయిలో జరిగే చెకుముకి సైన్స్ సంబరాలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శివశంకర్ రెడ్డి. ప్రిన్సిపల్ జయసింహ రెడ్డి విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసారెడ్డి, గౌస్ లాజం, పవన్, రమణ నాయక్ ,వెంకటచలమయ్య, ఎల్లప్ప, రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోధకులు లేరు..పుస్తకాలూ లేవు...

ఇదీ కేజీబీవీలో ఇంటర్ విద్య పరిస్థితి
పరీక్షలపై ఆందోళనలో విద్యార్థులు



విద్యార్థినులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)ల్లో ఇంటర్ విద్య తూతూమంత్రంగా సాగుతోంది. విద్యాసంవత్సరం చివరి దశకు వచ్చినా ఇంతవరకు బోధకులను నియమించకపోవడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 62 కేజీబీవీలు ఉన్నాయి. గతంలోనే 14 చోట్ల ఇంటర్మీడియట్ కోర్సులు నిర్వహిస్తుండగా ప్రస్తుతం అంతటా అమలు చేస్తున్నారు. తరగతులు బోధించడానికి అధ్యాపకులను నియమించాలి. అయితే ఎక్కడా నియమకాలు జరగలేదు. ఉన్న ఉపాధ్యాయులతోనే ఇంటర్ చదువులు చదివిస్తున్నారు. ఎక్కడా పూర్తిస్థాయిలో లేరు. జూన్‌లో హడావుడిగా మొదటి సంవత్సరం బైపీసీ ప్రవేశాలు కల్పించారు. ఒక్కో కేంద్రంలో 40 సీట్లు ఉండగా 20 నుంచి 35 మంది విద్యార్థినులు మాత్రమే ఉన్నారు. కేజీబీవీల్లో జూనియర్ ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు అందలేదు. గత నెలలో తాత్కాలికంగా అతిథి అధ్యాపకుల నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చారు. అయిన ఎవరూ ముందుకు రాలేదు. దీంతో స్థానికంగా ఉన్న వారిని తీసుకోవాలని సూచించి చేతులు దులుపుకున్నారు. వేరే దారి లేక అక్కడున్న ఉపాధ్యాయులే అధ్యాపకులుగా మారి ఇంటర్ విద్యార్థులకు చదువులు చెప్పాలన్నా ఇంత వరకు పుస్తకాలు అందలేదు. ప్రతి కెజిబివికి తప్పని సరిగా తెలుగు, జువాలజీ, ఫిజిక్స్, వృక్ష శాస్త్రం, రసాయనశాస్త్రం, ఇంగ్లీషు అధ్యాపకుల అవసరం ఉంది. అయితే గతంలో ప్రారంభించిన పాఠశాలల్లో మాత్రమే కొంత మంది ఉన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించిన ఏ పాఠశాలల్లోను పూర్తి స్థాయిలో అధ్యాపకులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో మూడు నెలల్లో పరీక్షలు జరగనున్న తరుణంలో పరీక్షలు ఎలా రాయాలో అర్థం కావడం లేదని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

అధ్యాపకులను నియమించాలి



కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలల్లో ప్రభుత్వం వెంటనే అధ్యాపకులను నియమించాలి. విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలను అందించాలి. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతాం.

బాబావలి
ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

సత్యసాయి జిల్లాలో వర్షపాతం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మాండూస్ తుపాను వల్ల శనివారం పగలూ రాత్రి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 131.4 మి॥మీ॥. వర్షపాతం నమోదు అయింది. దీనికి తోడు విపరీతంగా చలి పెట్టడంతో వద్ధులు పిల్లలు చలికి వణికిపోయారు. రోజంతా ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఆదివారం నాడు రెవెన్యూ గణాంక అధికారుల లెక్కల ప్రకారం వర్షపాతం భారీగా నమోదయ్యింది. ఆదివారం వర్షం రాకపోయినప్పటికీ పూర్తిగా మేఘాలు కమ్ముకున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఒక మోస్తారు వర్షాలు కురిశాయి.

కదిరి వైసిపిలో బయటపడ్డ విభేదాలు

స్థానిక ప్రజాప్రతినిధిపై 'సజ్జల'కు ఫిర్యాదు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి నియోజకవర్గంలోని వైసిపి నాయకుల్లో విబేధాలు బయటపడ్డాయి. ఎన్పీకుంట మండలంలో ఓప్రయివేటు కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డికి వైసిపి నాయకులు స్థానిక ప్రజాప్రతినిధిపై ఫిర్యాదు చేశారు. వైసిపి పట్టణ అధ్యక్షుడు బాహుద్దీన్ స్థానిక ప్రజా ప్రతినిధి సిద్ధారెడ్డిపై ఫిర్యాదు చేశారు. గతంలో పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసిపి అభివృద్ధికోసం ఎంతో కృషి చేశామన్నారుజ కదిరిలో వైసిపి అధికారంలోకి రావటానికి అహర్నిశలు కృషి చేసిన నాయకులను స్థానిక ప్రజా ప్రతినిధి పూర్తిగా విస్మరించారని విమర్శించారు. పార్టీ అధికారంలోకి రావటానికి సైనికుల్లా పనిచేసిన ఎందరినో పక్కనపెట్టిన ఎమ్మెల్యే కేవలం తన వ్యక్తిగత స్వలాభం కోసం పనిచేస్తున్నారని తనకు అనుకూలమైన వారికి అండగా నిలుస్తూ పార్టీ పదవులతో పాటు నామినేటెడ్ పదవులు కట్టబెడుతున్నారని విమర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధి ఒంటెత్తు పోకడలతో పార్టీకి తీవ్రనష్టం వాటిల్లిందని అన్నారు. అలాగే నియోజకవర్గంలో కాంట్రాక్ట్ పనులన్నీ సొంతవారికి కట్టబెడుతున్నారని పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కదిరి నియోజకవర్గంలో పార్టీ పూర్తిగా కష్టాల్లో పడిందని నియోజకవర్గంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు భరోసానిచ్చేలా దృష్టి సారించాలని సజ్జలను వారు కోరారు.



సజ్జల రామకృష్ణారెడ్డితో వైసిపి నాయకులు బాహుద్దీన్, తదితరులు

రబ్బర్‌స్టాంప్ పదవి వద్దు.. : ఎంపిపి

ప్రజాశక్తి - అగళి

రబ్బర్‌స్టాంప్‌గా ఉన్న ఈ పదవి తనకొద్దని అగళి ఎంపిపి రేణుకకామరాజు తేల్చిచెప్పారు. ఈ మేరకు ఎంపిపి, తన భర్త కామరాజుతో కలిసి ఆదివారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు విషయాలను వెల్లడించారు. తప్పనిసరి పరిస్థితుల్లో స్థానిక ఎమ్మెల్యే తనకు అప్పజెప్పిన ఈ పదవి కేవలం అలంకారప్రాయంగానే ఉందని తనమాట ఎక్కడా చెల్లుబాటు కావటం లేదని పోయారు. ఎమ్మెల్యే మండలంలో గ్రూపు రాజకీయాలను పెంచి పోషిస్తున్నారని తన మాట నాయకుల వద్ద, అధికారుల వద్ద చెల్లుబాటు కాకుండా చేశారని ఆరోపించారు. 14 నెలలుగా ఎంపిపిగా ఉన్నా తనమాట ఎక్కడా చెల్లుబాటు కావటం లేదని వాపోయారు. ఎంపిపి పదవి కేవలం అలంకార ప్రాయంగానే ఉందని అవేదన వ్యక్తం చేశారు. దీంతో తాను ఎంపిపి పదవికి రాజీనామా చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. అయితే స్థానిక ఎమ్మెల్యే అనుసరిస్తున్న వైఖరి, తనకు జరుగుతున్న అన్యాయంపై ఈనెల 15న మండకశిర నియోజకవర్గంలో పర్యటిస్తున్న ఎపి వైసిపి రాయలసీమ కోఆర్డినేట్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళతానని చెప్పారు.

ఆదినుంచి అదే పరిస్థితి : మడకశిర నియోజకవర్గంలోని అగళి ఎంపిపి ఎన్నిక జరిగిన నాటినుంచి పరిస్థితి ఇలాగే ఉంది. మండలంలోని కోడిపల్లి ప్రాదేశిక స్థానం నుంచి ఎన్నికైన రేణుక కామరాజును ఎంపిపిగా ఎన్నుకోవటమే నాటకీయ పరిస్థితుల్లో జరిగిందని చెప్పవచ్చు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యేపై అనేక అరోపణలు వెల్లువెత్తాయి. 2021లో జరిగిన ఎంపిటిసి ఎన్నికల్లో అగళి మండలంలోని 10 ఎంపిటిసి స్థానాల్లో 8 వైసిపి బలపర్చిన అభ్యర్థులు, 2 స్థానాల్లో టిడిపి బలపరచిన అభ్యర్థులు విజయం సాధించారు. ఎంపిటిసిలందరూ కలసి ఎంపిపిగా ఎన్నుకోనే సమయంలో అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. మెజార్టీ స్థానాలు గెలుపొందిన వైసిపి బలపర్చిన 8 మంది ఎంపిటిసిలు ఎంపిపి అభ్యర్థిని ఎన్నుకునే బాధ్యతను స్థానిక ఎమ్మెల్యే తీసుకున్నారు. ఈ సమయంలోనే ఎమ్మెల్యే వైఖరిపై పలు అరోపణలు వెల్లువెత్తాయి. ఎవరైతే ముడుపులు ఇస్తారో వారికే ఎంపిపి పదవిని కట్టబెడుతున్నాడన్న ఆరోపణలు అప్పట్లో విన్పించాయి. ఈ నేపథ్యంలో ఒకరి పేరును


ఎంపిపి రేణుక కామరాజు

అన్యాయంపై పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఫిర్యాదు చేస్తా

ప్రతిపాదించాడు. మిగిలిన ఎంపిటిసిలు ఆ ఎంపిటిసికి ఓటు వేయాలని ఆదేశాలు ఇచ్చాడు. మెజార్టీ ఎంపిటిసి స్థానాలు దక్కించుకున్న ఓ సామాజికవర్గం వారంతా ఈ సమయంలో ఒక్కట య్యారు. అందరూ కలసి ఎంపిపి ఎన్నిక కార్యక్రమానికి గైర్హాజ రయ్యారు. దీంతో కోరం లేదని ఎంపిపి ఎన్నికను అధికారులు ఆరోజు వాయిదా వేశారు. ఈ పరిణామాన్ని ఊహించని ఎమ్మెల్యే ఒక్కసారిగా ఖంగుతిన్నారు. మండలంలో జరుగుతున్న పరిణామాలను గమనించిన ఎమ్మెల్యే ఈ విషయంలో ఓ మెట్టు దిగారు. దీనికంతటికి మూలకారణమైన కోడిపల్లి ఎంపిటిసికే ఎంపిపి పదవి ఇచ్చేలా అంగీకరించాడు. దీంతో రెండు రోజుల అనంతరం జరిగిన కార్యక్రమంలో వైసిపి మద్దతుదారులుగా ఉన్న 8 మంది ఎంపిటిసిలు కలసి కోడిపల్లి ఎంపిటిసి రేణుక కామరాజును ఎంపిపిగా ఎన్నుకున్నారు.


వైసిపి నాయకులు కామరాజు

ఇక అప్పటినుంచే అసలు కథ మొదలైంది. ఎంపిపిగా ఎన్నికైన రేణుక కామరాజుకు ఈ పదవి కేవలం అలంకారప్రాయమేనని కొద్దిరోజులకే తెలిసివచ్చింది. ఎక్కడా తన మాట చెల్లుబాటు కాలేదు. అధికారులు సైతం తన మాటలు పెడచెవిన పెడుతున్నారు. కేవలం కుర్చీకే పరిమితమైన పరిస్థితి ఏర్పడింది. ఇదంతా ఎమ్మెల్యే ఆదేశాలతోనే జరుగుతున్నట్లు ఎంపిపి రేణుక, ఆమె భర్త కామరాజు గ్రహించారు. ఎమ్మెల్యే నిర్ణయించిన ఎంపిటిసికి ఎంపిపి పదవి దక్కలేదన్న అక్రోశంతోనే తన పదవిని రబ్బర్‌స్టాంప్‌గా మార్చారని ఎంపిపి తెలుసుకున్నారు. అయినా పార్టీ పట్ల ఉన్న అభిమానం, పార్టీకి చెడ్డపేరు రాకూడదని భావించారు. తనకు అనుకూలంగా ఉన్న వైసిపి నాయకులు, కార్యకర్తల పనులు జరగడం లేదు. అధికారులు తమ మాట వినడం లేదు. అభివృద్ధి కారక్రమాల్లో ప్రాధాన్యత లభించడం లేదు. ఇవన్నీ 14 నెలలుగా ఎంపిపి భరించారు. ఇక లాభం లేదనుకున్నారు. రబ్బర్‌స్టాంప్‌గా ఉన్న ఈ పదవి తమకొద్దని రాజీనామాకు సిద్ధమయ్యారు. చివరగా తమకు జరుగుతున్న అన్యాయం, ఎమ్మెల్యే నియోజకవర్గంలో అనుసరిస్తున్న వైఖరిని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి రాజీనామా చేయాలని భావించారు.

నాటువైద్యం ఘటనలో మరొకరు మృతి



ఓబుల దేవర చెరువు : సూది మందు వికటించిన ఘటనలో మరొకరు మృతిచెందారు. మండలంలోని తుమ్మలకుంటపల్లి గ్రామానికి చెందిన పీరా అనే వ్యక్తి మోకాళ్ళ నొప్పులకు ఈనెల మూడో తేదీన అమడుగురు మండలం పూలకుంట్లపల్లి పంచాయతీలో నాటు వైద్యం సూది మందు వేయించుకున్నాడు. అయితే పీరాకు కాళ్ల వాపులు రావడంతో కదిరి ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు.

రైల్లో నుంచి జారిపడి తెనాలివాసి దుర్మరణం

ధర్మవరం టౌన్ : ధర్మవరం రైల్వేస్టేషన్ సమీపంలో గుట్టకిందపల్లి వద్ద తెనాలికి చెందిన వ్యక్తి రైల్లోనుంచి జారి కిందకు పడి మృతిచెందిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. రైల్వే జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు... గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కరీముల్లా హుస్సేన్ (25) ఐటిఐ పూర్తి చేసుకుని గుత్తి రైల్వే స్టేషన్లో ట్రైనింగ్ కోసం వచ్చాడు. ఈ నేపథ్యంలో కరీముల్లా హుస్సేన్ పెనుకొండ కియా కంపెనీలో పనిచేస్తున్న తన తమ్ముడు వద్దకు శనివారం ఉదయం రైల్లో పెనుకొండకు వెళ్లాడు. అక్కడ తమ్ముడితో మాట్లాడి తిరిగి పెనుకొండ నుండి గుత్తికి రైల్లో బయలుదేరాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో ధర్మవరం సమీపంలోని గుట్టకిందపల్లి వద్దకు రాగానే ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారి కిందకు పడ్డాడు. ఈ ప్రమాదంలో కరీముల్లా అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకుని సంఘటనాస్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతుని జేబులో ఉన్న రేషన్, ఆధార్ కార్డులు, మొబైల్ ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారమందించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఓబుల దేవర చెరువు : మండల పరిధిలోని సున్నంపల్లి వద్ద శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మంజునాథ్ (33) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. కర్నాటక లోని టీవీ క్రాస్ కు చెందిన మంజునాథ్ శనివారం రాత్రి మహమ్మదాబాద్ క్రాస్ నుంచి ద్విచక్ర వాహనంలో సొంతగ్రామానికి బయలుదేరాడు. కదిరి హిందూపురం ప్రధాన రహదారి వంచిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీ వద్ద గుర్తుతెలియని వాహనం మంజునాథ్ వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో మంజునాథ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపీ, ఏఎస్ఐ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

రెండు కార్లు ఢీకొని ఆరుగురికి గాయాలు

గోరంట్ల : మండలంలోని మల్లాపల్లి సమీపాన హిందూపురం రోడ్డులో రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు గాయపడ్డారు. సిఐ సుబ్బరాయుడు తెలిపిన వివరాలు... లేపాక్షి మండలం కొండూరు గ్రామానికి చెందిన సురేష్, నాగరాజు, చౌడమ్మ, సుకన్య, భానుతేజ ఒక కారులో హిందూపురం వైపు వెళుతుండగా ఎదురుగా హైదరాబాద్ కు చెందిన మృనాత్, మరొక వ్యక్తి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో హిందూపురం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కర్నాటక మద్యం స్వాధీనం

కనగాన పల్లి : మండల పరిధిలోని మరూర్ టోల్ ప్లాజా వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీలో కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒకకారు తమను చూసి వెనక్కుతిప్పుకుని వెళ్లారన్నారు. ఆ కారు అతివేగంగా వెళుతూ మామిళ్లపల్లి సమీపంలో ఎన్‌హెచ్ 44పై డివైడర్‌ను ఢీకొందన్నారు. దీంతో డ్రైవర్‌కారు వదిలి పారిపోయాడన్నారు. సమాచారం తెలుసుకున్న తాము సిబ్బంది తో పాటు వెళ్లి చూగా అందులో కర్నాటక మద్యం ఇరవై ఐదు బాక్సులు ఉన్నట్లు గుర్తించామన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేశామన్నారు. కారు నెంబర్ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంబరాన్నంటిన కొడిగెనహళ్లి గురుకులం స్వర్ణోత్సవాలు



పాఠశాల స్వర్ణోత్సవ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, తదితరులు


ప్రజాశక్తి -పరిగి

మండలంలోని కొడిగెనహళ్లి ఎపిఆర్ఎస్ ఎక్సలెన్స్ పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా ముగిసాయి. పాఠశాల పూర్వ విద్యార్థులు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల పూర్వ విద్యార్థి, తెలంగాణ స్టేట్ రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాసరాజు హాజరయ్యారు. ఆయనతోపాటు ప్రభుత్వ, ప్రయివేటు రంగంలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పూర్వ విద్యార్థులు ఐఆర్ఎస్ ఆంజనేయులు, విజయ్ కుమార్, ఇండియన్ టెలికాం సర్వీస్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ సురేంద్రబాబు, ఎన్ఆర్ఐలు సురేంద్ర పెరుగు, శ్రీరామ్ వెంకటకృష్ణ తదితరులు పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ ప్రభుత్వ రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాసరాజు మాట్లాడుతూ 1972లో పివి నరసింహారావు చొరవతో స్థాపించబడిన నేటికీ 50 వసంతాలు పూర్తి చేసుకున్న ఈ విద్యాలయం ఎంతోమంది వ్యక్తులను దేశానికి అందించిందని అన్నారు. విజ్ఞానంతో పాటు సంస్కారం, దేశభక్తి, సామాజిక బాధ్యత, సేవా తత్పరత ఈ పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయుల ద్వారా తాము నేర్చుకుని ఈ స్థాయికి చేరుకున్నామన్నారు. అనంతరం పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు తాము కృషి చేస్తున్నామని భవిష్యత్తులో కూడా తమ తోడ్పాటు కొనసాగుతుందని అన్నారు. ఇలాగే అనేకమంది మేధావులను అందించే విద్యాసంస్థగా కొనసాగడానికి ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలని కోరారు. కోడిగిన హళ్లి రాష్ట్రస్థాయిలో ఏ గురుకుల పాఠశాలకు లేనన్ని వసతులను పూర్వ విద్యార్థుల సంఘం సమకూర్చిందని ఇక్కడ చదివిన విద్యార్థులుగా తమ రుణాన్ని ఇలా తీర్చుకుంటున్నారని, వీరి సేవలు, మరువలేనివని కొనియాడారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు గతంలో పాఠశాలలో తమకు బోధించిన గురువులను, ప్రస్తుతం పని చేస్తున్న బోధన బోధనేతర సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోడిగెనహళ్లి గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు సురేష్ పెరుగు, సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు

ప్రభుత్వ ఆదాయానికి ఎగనామం

ప్రజాశక్తి నంబుల పూల కుంట



నంబులపూలకుంట మండలంలో యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు వెలుస్తున్నాయి. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి ఎగనామం పెడుతున్నారు. ఒక వ్యవసాయ భూమిని వ్యాపార భూమిగా మార్చాలంటే రెవెన్యూ, పంచాయతీ అనుమతి అవసరం. అనుమతి వచ్చిన తరువాత లేఅవుట్ వేసిన భూయజమాని అతని భూమి యొక్క సర్వే నంబర్, విస్తీర్ణం, లేఅవుట్ వేసిన స్థలం వద్ద మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రభుత్వ అభివృద్ధి కోసం కొంత భూమి కేటాయించాలి. అలాగే ప్రభుత్వం నిర్ణయించిన రుసుము చెల్లించాలి. అయితే ఇవేవీ లేకుండా మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది. రియల్టర్లు ప్రభుత్వ ఆదాయానికి ఎగనామం పెడుతున్నారు. మండల కేంద్రానికి సోలార్ ప్రాజెక్టు రావడం వల్ల ఇతర ప్రాంతం వారు ఈ మండల కేంద్రంలో స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకోవటంలో భాగంగా రియల్ ఎస్టేట్ వ్యాపారానికి డిమాండ్ పెరిగింది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు గుట్టు చప్పుడు కాకుండా తాము కొన్న భూములకు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములు, వాగులు వంకలను కలుపుకొని లేఅవుట్ వేసి దర్జాగా రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగిస్తున్నారు. ఇటు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని అటు ప్రభుత్వానికి రుసుం చెల్లించకుండా తమ వ్యాపారానికి కొనసాగిస్తున్నారు. సంబంధిత అధికారులు ఈ విషయంపై చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ఒక సామాన్యుడు నివాసానికి ఇంటి స్థలం అడిగితే ప్రభుత్వ ఆదేశాల మేరకు జీవో రావాలనో ఇతర కారణాలో చూపి వెనుక్కు పంపే అధికారులకు ఈ రియల్ దందా కన్పించడం లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునే వారికి ఎలాంటి జీవోలు వర్తించవా అని నిలదీస్తున్నారు. ఈవిషయంపై జిల్లా ఉన్నత అధికారులు స్పందించి అక్రమ లే అవుట్లపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వైసిపి హయాంలో బిసిలకు ప్రాధాన్యత

గోరంట్ల : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని జెడ్పీటీసీ జయరాం నాయక్ అన్నారు. వైసిపిలో బిసిలకు ప్రాధాన్యత లేదని స్థానిక టిడిపి నాయకులు చేసిన విమర్శలకు అర్థం లేదన్నారు. ఇప్పటికైనా టిడిపి నాయకులు వైసిపి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

'సజ్జల'ను కలిసిన వైసిపి నాయకులు

గాండ్లపెంట : ఎన్‌పికుంట నుంచి వస్తున్న ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిని, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డిని మండల వైసిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బిసి మండల అధ్యక్షుడు జక్కల లక్ష్మి నరసింహ గౌడ్, బూత్ కన్వీనర్ జి రవీంద్రారెడ్డి, రాజారెడ్డి, మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

నేడు యథావిధిగా 'స్పందన'

పుట్టపర్తి అర్బన్ : ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం ఈ సోమవారం యథావిధిగా నిర్వహిస్తున్నామనిజిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్ నుంచి ప్రకటన విడుదల అయింది. ఉదయం 9:30 గంటల నుంచి స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు. డివిజన్, మండల స్థాయిలో కూడా స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సమస్యలున్న వారు నేరుగా స్పందనలో అర్జీలు సమర్పించుకోవచ్చు అన్నారు. అర్జీల్లో ఆధార్, ఫోన్ నెంబర్ వేయాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

లేపాక్షి : స్థానిక జవహర్ విద్యాలయంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. 1997 సంవత్సరంలో విద్యాలయంలో ప్రవేశం పొంది 2004 సంవత్సరంలో చదువు ముగించుకుని దేశ విదేశాల్లో పనిచేస్తున్న వారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆనాటి నెమరు వేసుకున్నారు. అప్పటి తమ గురువులను సన్మానించారు. వారందరూ కలిసి విద్యాలయానికి రూ. 5 లక్షల విలువ చేసే ఒక వాహనం, బాలికలు వసతి గృహానికి రూ. 8లక్షలతో ప్రహరీ నిర్మాణం, రూ. 6 లక్షల ఖర్చుతో పాల్ సీలింగ్, అత్యాధునిక లైట్ సిస్టం ఏర్పాటు చేశారని ప్రిన్సిపాల్ ఎం. నాగరాజు తెలిపారు.

'ఆశా' పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర రూరల్ : మండల పరిధిలోని నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఖాళీగా ఉన్న రెండు ఆశావర్కర్ల పోస్టుల భర్తీకి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ భార్గవి తెలిపారు. గంగలవాయిపాలెం, జిల్లెడు గుంట గ్రామాల్లో ఆశా కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

ఉచిత కంటివైద్యశిబిరం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని సుదర్శన్ కాంప్లెక్స్ పక్కన గల మున్సిపల్ కాంప్లెక్స్ లో నేత్రాలయ ఐ క్లినిక్ వారి ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి కడప వారిచే ఆదివారం ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు నేత్రాలయ ఐ క్లినిక్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. మాట్లాడుతూ ఆప్తాల్- డిఒఎ ప్రవీణ్‌కుమార్ చే రోగులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ శిబిరంలో 20 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు వివరించారు.

రాష్ట్రంలో శాశ్వత పథకాలు ఎక్కడ .?: టిడిపి

ధర్మవరం టౌన్ : వైసీపీ ప్రభుత్వం ఒక్కటి కూడా శాశ్వత పథకం ప్రవేశపెట్టలేదని టీడీపీ నాయకులు విమర్శించారు. పట్టణంలోని 35వ వార్డులో ఆదివారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగూరు హుస్సేన్, కొత్తపేట ముత్తుకూరు బీబీ, అత్త రహీంబాషా, ఆది, నారాయణస్వామి, రాయపాటి శివ తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : తనకల్లుగ్రామ పంచాయతీలోని రెడ్డివారిపల్లి,రెడ్డివారి పల్లి తండా, గుంజువారి పల్లిలో టిడిపి మండల కన్వీనర్ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో తనకల్లు మండల పరిశీలకులు నాగేంద్రప్రసాద్ తదితరులు ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పాలన అస్తవ్యస్తంగా ఉందన్నారు.ఉద్యోగులకు నెలవారి వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని అన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఎన్నికలు ఎప్పుడు వస్తాయని ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి నాగేంద్ర ప్రసాద్, నాయకులు మల్లికార్జున, సోంపాళ్యం నాగభూషణ, సీనియర్ నాయకుడు దేశాయ్ హరినాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

సేవాకార్యక్రమాలే రోటరీక్లబ్ ధ్యేయం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్


పేదలకు సేవా కార్యక్రమాలను చేయడమే తమ లక్ష్యమని రోటరీక్లబ్ అధ్యకులు కృష్ణమూర్తి పేర్కొన్నారు. పట్టణంలోని కోట మున్సిపల్ పాఠశాలలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు చెందిన శంకర కంటి ఆస్పత్రి, జిల్లా ఆంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శంకర కంటి ఆస్పత్రి వైద్యురాలు ప్రియా కంటి పరీక్షలు నిర్వహించి కంటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈశిబిరానికి క్యాంపు చైర్మన్ గా నరేంద్రరెడ్డి వ్యవహరించారు. ఈశిబిరంలో 189 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించగా ఇందులో 91 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపికచేశామని క్లబ్ అధ్యక్షులు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రామకృష్ణ, సభ్యులు సత్రసాల ప్రసన్నకుమార్, సోలిగాళ్ల వెంకటేశులు. రత్నశేఖర్‌రెడ్డి, రమేష్‌బాబు, శివయ్య, సుదర్శన్ గుప్తా, బండారు చలం, శ్రీనివాసరెడ్డి, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

'సజ్జల'కు వైఎస్ఆర్‌టిఎఫ్ నాయకుల వినతి

ప్రజాశక్తి నంబుల పూలకుంట

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిని వైఎస్ఆర్‌టిఎఫ్ నాయకులు కోరారు. మండల కేంద్రంలో జరిగిన ఓ శుభ కార్యక్రమానికి ఆదివారం హాజరైన సజ్జల రామకృష్ణారెడ్డిని వైఎస్ఆర్‌టిఎఫ్ స్థానిన నాయకులు కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌టిఎఫ్ నాయకులు గంగాధర్ రెడ్డి, వెంకట్రామి రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సిపిఎస్ రద్దుచేసి సిపిఎస్ అమలు చేయాలన్నారు. పెండింగ్ ఉన్న పిఆర్‌సి, డిఎ చెల్లించాలన్నారు. అదేవిధంగా బోధనేతర పనులైన వివిధ యాప్లను, నాడు నేడు నుంచి టీచర్లను మినహాయించాలని సకాలంలో వేతనాలు అందేలా చూడాలని కోరారు. తమ సమస్యలపై సజ్జల రామకృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌టిఎఫ్ నాయకులు అంజి నాయక్, ఇంద్ర ప్రసాద్, శివయ్య, మనోహర్ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


సజ్జల రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్ఆర్‌టిఎఫ్ నాయకులు

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని చిన్న మార్కెట్‌లో వద్ద శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నదాన సత్రం నిర్మాణానికి ఎపి ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ ఆదివారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.


భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నవీన్ నిశ్చల్

చెరువు ముంపు రైతులను ఆదుకోవాలి


ప్రజాశక్తి. పుట్టపర్తి అర్బన్

బుక్కపట్నం చెరువు నిండటం వల్ల పంట పొలాలు ముంపునకు గురైన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దాదాపు 400 ఎకరాలు చెరువు ముంపునకు గురైందన్నారు. పుట్టపర్తి, పెద్ద కమ్మవారి పల్లి, జానకంపల్లి రైతులు ఎన్నో ఏళ్లుగా చెరువు మునుగడ భూములలో పంటలు సాగుచేసుకుని జీవిస్తున్నారన్నారు. అయితే హంద్రీనీవా కాలువ ద్వారా చెరువుకు నీరు నింపడంతో గత ఐదారేళ్లుగా ఆ భూములు ముంపునకు గురవడంతో పంటలు పెట్టుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. ఆ భూముల రైతులకు తగిన నష్టపరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా ఆ రైతులు తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగిన న్యాయం చేయాలన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి ,కదిరి టౌన్

కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా బాధితులకు మంజూరైన సిఎం సహాయనిధి చెక్కులను స్థానిక ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి లబ్ధిదారులకు ఆదివారం పంపిణీ చేశారు. పలువురికి మంజూరైన రూ.14.20 లక్షల రూపాయల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వర్తించనివివిధ జబ్బులతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న 9 మంది లబ్ధిదారులకు రూ. 14.20 లక్షల రూపాయల చెక్కులను అందజేసినట్లు చెప్పారు. ఈసందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నజీమున్నీసాసాదిక్, జెడ్పీటీసీ విశ్వనాథ్ రెడ్డి, కౌన్సిలర్ షాను, సర్పంచులు కుర్లి శివారెడ్డి, సెమీవుల్లా, ఎంపీటీసీ హేమశేఖర్ రెడ్డి, ఎస్సీ సెల్ కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులతో ఎమ్మెల్యే సిద్ధారెడ్డి